

కథ

**ఆదుర్తి బాల**

# ముందే ఊహించా

వర్ధనమ్మగారిది భారీ శరీరం. లౌడ్‌స్పీకర్‌లా మోగే గొంతు. మా పేటలో శబ్దకాలుష్యానికి సగం కారణం ఆవిడ గొంతే అంటారు గిట్టనివాళ్లు. రెండు మూడుసార్లు గుళ్లో చూశాను ఆవిడని. అలా ముఖ పరిచయమైంది. తరువాత మాటలు కలిశాయి. మాటల సందర్భంలో చెప్పింది వాళ్లుండేది మా పక్క వీధినేనని. ఆ కాస్త పరిచయానికే ఆవిడకి తోచనప్పుడల్లా మా ఇంటికి వచ్చి గంటలకొద్దీ సుత్తివేసి నా బుర్ర తినేసేది. ఆవిడకి అఖ్ఖర్లేని కబుర్లంటూ ఏమీ ఉండేవి కావు. ఆవిడ ఏ విషయం గురించి చెప్పినా చివరికి "నేను అప్పుడే అనుకున్నాను ఇలా జరుగుతుందని" అంటుంది. జరగబోయే విషయాలన్నీ ముందే తెలుసుకున్న బ్రహ్మజ్ఞానిలా ఎదుటి మనిషి ఇంటి విషయాలు తెలుసుకోవటంలో ఆవిడకి ఆసక్తి ఎక్కువ. మా పేటలోని దాదాపు అందరి ఇంటి గుట్లూ ఆవిడకి తెలుసు. కృష్ణారామా అనుకోవాల్సిన వయసులో ఆవిడకి ఇదేం పిచ్చో నాకర్థం కాదు.

ఆ రోజు తలనెప్పిగా ఉండడంతో అమృతాంజనం రాసుకుంటూ కూర్చున్నాను. ఇంతలో గేటు బరబరా తోసుకుంటూ గునగునా నడిచి వస్తున్న వర్ధనమ్మగార్ని చూడగానే తలపోటు అధికమైంది. గబగబా లోపలికి నడచి అక్కడ కూర్చుని చదూకుంటున్న నా కూతురు దివ్యని కేకేశాను.

"ఇదుగో ఆ మహాతల్లి వస్తోంది గానీ నేను నిద్రపోతున్నానని చెప్పు" అంటూ బెడ్‌రూంలోకి దూరాను.

"అమ్మాయ్ - అమ్మాయ్" అంటూ సైరన్ లాటి గొంతుతో అరుచుకుంటూ వచ్చి "ఇదుగో పిల్లా మీ అమ్మేదే" అంది అక్కడే ఉన్న దివ్యనుద్దేశించి.

"తలనెప్పిగా ఉంటే టాబ్లెట్ వేసుకుని పడుకుందండి" అన్నది దివ్య.

"ఊ.. వచ్చిందీ తలనెప్పి! అర్ధరాత్రి వరకూ కూర్చుని టీవీ చూస్తే ఏ తలనెప్పో పట్టుకుంటుందని నేనప్పుడే అనుకున్నాను" అంది వర్ధనమ్మ. ఆవిడ మాటలన్నీ బెడ్‌రూంలో ఉన్న నాకు వినిపిస్తూనే ఉన్నాయ్. నాకిష్టమైన సినిమా ఏదైనా టీవీలో వస్తే ఎంత రాత్రి అయినా ఆ సినిమా పూర్తిగా చూసి పడుకుంటాను నేను. ఆ సంగతి ఎప్పుడో అన్నాను ఆవిడ తోటి. కానీ ఇప్పటి నా తలనెప్పికి టీవీ చూడడం కారణం కాదు. క్రితం రోజు నేనసలు టీవీ చూడలేదు!

"మా అమ్మ నిన్న టీవీ చూడలేదండీ - పెందరాళే నిద్రపోయింది" అన్నది నా కూతురు.

"నిన్న చూడకపోతేనేమే మొన్న చూసిందిగా ఆ తలనెప్పి నిన్నంతా బుర్రలో ఉండి ఇవాళ బైటపడిందన్న మాట" అన్నది వర్ధనమ్మ. ఆవిడ విచిత్రమైన విశ్లేషణ వింతగా అనిపించింది నాకు. ఆవిడ మాటలకి నా కూతురు బిగ్గరగా నవ్వేసింది. "ఎప్పుడో చూసిన టీవీ ప్రోగ్రాంకి ఈ రోజు తలనెప్పి రావడమేంటండీ" అంది అది. దాని మాటలకి ఆవిడ ఒక్కసారి సైలెంట్ అయి "నీ పరీక్షలెప్పుడే" అంది.

"వచ్చే నెలలో" అన్నది దివ్య.

"మరి ఇప్పట్నించే చదవడంలో అర్థం ఏమిటి? ఇప్పుడు చదివిన చదువు బుర్రలో ఉండిపోయి ఏ నెల రోజుల తరువాతో నువ్వు రాయబోయే పరీక్షల్లో బైటపడాలనేగా. అదెలాగో ఇదీ అలాగే" అంది ఆవిడ. వితండవాదులతో మాట్లాడడం కష్టం.

"సర్లే నిద్రపోతున్నదాన్ని లేపటమెందుకు కానీ ఓ గ్లాసెడు పంచదార ఇవ్వవే" అంది వర్ధనమ్మ.

ఆవిడ అప్పు కోసం వచ్చిందని అర్థమైంది నాకు. చీటికి మాటికీ పంచదారకో, చింతపండుకో అప్పుకోసం రావడం ఆవిడకలవాటే. అప్పు తీసుకోవడంలో ఉన్న శ్రద్ధ తీర్చడంలో ఉండదావిడకి.

"మీ గున్నమ్మగారు వెళ్లిపోయారు గానీ ఇంక లేమ్మా" ఆవిడ అటు వెళ్లగానే వచ్చి చెప్పింది నా కూతురు దివ్య.

"హమ్మయ్య" అనుకుంటూ లేచాను నేను.

గున్న ఏనుగులాటి ఆవిడ పర్సనాల్టీని చూసి మేమంతా ఆవిడని 'గున్నమ్మగారు'ని పిలుచుకుంటాం.

"ఇదుగో అమ్మాయ్ ఈ సంగతి విన్నావా" అంటూ పొద్దున్నే దిగబడింది మా గున్నమ్మగారు.

"లేవగానే ఎవరి మొహం చూశానో ఏమో. ఇప్పుడు ఈవిడ సుత్తి భరించాలి కాబోలు ఈ రోజు పనమ్మాయి రానని చెప్పేసింది కూడా!"

ఆవిడ రాకకి మనసులోనే దిగులు పడుతూ ఆముదం తాగినట్టు మొహం పెట్టాను.

"ఏమిటమ్మాయ్ అలా ఉన్నావు. ఒంట్లో బాగులేదా ఏంటీ అన్నట్టు ఇవేళ ఓ కొత్త విషయం తెలిసిందమ్మాయ్ అన్నదావిడ" ఉపోద్ఘాతంలా.

"ఏమిటో నువ్వో మాలోకంవి. కొత్త విషయం అని అనగానే అదేమిటో తెలుసుకోవాలనే ఉండదు నీకు"


"ఇవాళ పనమ్మాయి రాలేదండీ చాలా పనుంది" అన్నాను. అలా అంటే అర్థం చేసుకుని వెళ్లిపోతుందన్న ఆశతో!

నా ఆశ అడియాశ చేస్తూ "ఈ పనివాళ్లంతే నమ్మా" అని ఒక్క ముక్కలో తేల్చి పారేసి అసలు విషయంలోకి దిగిపోయింది.

"అదేనమ్మాయ్ మన పేట రెండో లైన్లో లేరూ అవధానిగారు... వాళ్లమ్మాయి ఎవడితోనో లేచిపోయిందట" అన్నది.

"ఉహూ" అన్నాను అనాసక్తంగా.

"అదేమిటమ్మాయ్ అలా నిమ్మకు నీరెత్తినట్టుండిపోయావ్. నీకేమీ అనిపించటల్లా..." అన్నది.



"ఇందులో అనిపించడానికేముందీ! ఈ రోజుల్లో ఇవి మామూలేగా" అన్నాను.

"అవుననుకో ఎక్కడో జరిగింది వినడం వేరు మన కళ్లెదుట జరగడం వేరు గదా ఆ అవధానిగారిది నిప్పులు కడిగే వంశం. వాళ్లింట్లో నిత్యాగ్ని హోత్రం వెలుగుతూ ఉంటుందట. అలాటి ఇంట్లో పిల్ల ఎవడో తక్కువ కులం వాడితో లేచిపోతే వాళ్లకెంత అప్రతిష్ఠ" అన్నది వర్ధనమ్మ.

"అయినా ఇలాటిదేదో జరుగుతుందని నేనప్పుడే అనుకున్నానులే" అన్నది మళ్లీ ఆవిడే.

ఈసారి ఆశ్చర్యపోవడం నా వంతైంది. నేను ఆశ్చర్యపోవడం చూసి చిద్విలాసంగా నవ్వింది వర్ధనమ్మ గారు.

"ఈమధ్యనే నేను కూరల మార్కెట్టుకెళ్లి వస్తున్నప్పుడు ఆ అవధాని గారి పిల్ల ఎవరో కుర్రాడితో కలిసి రావడం చూశాను. నల్లగా కాకిలా ఉంటాడు వాడు. ఇద్దరూ తెగ నవ్వేసుకుంటూ ఒకళ్ల మీద ఒకళ్లు పడిపోతూ నడుస్తున్నారు. అప్పుడే అనుమానం వచ్చింది నాకు. అప్పట్నించీ వాళ్లింటి మీద ఓ కన్నేసి ఉంచాననుకో. నువ్వు కనిపెట్టావో లేదో రెండురోజులుగా వాళ్లింటి తలుపులు వేసే ఉన్నాయి. అవధానిగారి కోడలు రోజూ గుళ్లో కనిపించేది. మన్నట్నించీ ఆ అమ్మాయీ గుడికి రాటల్లేదు. విషయమేంటో కనుక్కుందామని వాళ్లింట్లో పనిచేసే రావులమ్మని అడిగితే చెప్పింది. పోనీ ఓసారి పలకరించి వద్దామా విషయమేంటో వివరంగా తెలుసుకున్నట్టూ ఉంటుంది."

"వాళ్లింటి విషయాలు మనకెందుకులెండి" అన్నాను విసుగును మనసులో దాచుకుంటూ.

"బాగానే ఉందమ్మాయ్. కష్టకాలంలో ఒకర్నొకరు పలకరించుకోకపోతే ఎలా" అన్నదావిడ దీర్ఘం తీస్తూ.

బాధపడే వాళ్లని పలకరించి ఓదార్చడానికి నాకభ్యంతరం లేదుగానీ ఓదార్చే నెపంతో పలకరించి సస్పెన్సు కథ విన్నట్టు విషయాన్ని కూపీ లాగడం నాకసహ్యం." అనేశాను.

ఈ విషయంలో నా నుంచి ఆవిడకేం సహకారం ఉండదని అర్థం చేసుకుంది మా గున్నమ్మగారు.

మా ఇంటి ఎదురుగా ఉండే పద్మావతిగారు చీరల వ్యాపారం మొదలుపెట్టారు. ఓసారి వచ్చి చూడండి అంటే వెళ్లాను. ఆవిడ టీ ఇచ్చి చీరలు చూపించింది. అందులో ఓ చీర బాగా నచ్చింది నాకు. ఎలాగూ శ్రావణమాసం వస్తోందిగా అమ్మవారి పండగ నాడు

కట్టుకుందాంలే అని ఆ చీర కొనుక్కున్నాను. నేను చీర తెచ్చుకోవడం వర్ధనమ్మ గారి కంట పడనే పడింది. నా చేతిలోంచి చీర లాక్కొని మడతలన్నీ విప్పింది రెండు చేతులతోనూ చీర కొంగు గట్టిగా పట్టి లాగి చీర గట్టితనాన్ని పరీక్షించింది. అలా చీరంతా శల్యపరీక్ష చేసి -

"ఎంతక్కొన్నావేంటీ" అన్నది.

"ఐదు వందలు" అన్నాను.

అంతే...! ఏమిటి.. ఐదువందలే!! అన్నది నోరు వెళ్లబెట్టి ఆ మాటకి నా గుండె గుభేల్‌మంది. ఇప్పుడు ఈవిడ ఏం వాగుతుందో ఏమో. అది విని పక్కగదిలో పేపర్ చదూకుంటున్న మావారు నా మీద ఎలా రియాక్టవుతారో అని మనసంతా ఒకటే టెన్షన్ నాకు.

"ఆ పద్మావతి దగ్గర చీర కొన్నానని నువు అన్నప్పుడే అనుకున్నాను. నువు బోల్తాపడ్డావని" అన్నదావిడ విషయం ప్రారంభిస్తూ.

నా గుండెలో రైళ్లు పరిగెడుతున్నాయ్.

"ఆ పద్మావతి బాగా కబుర్లు చెప్పి ఎక్కువ రేటుకి చీర అంటగట్టింది నీకు. ఇలాంటి చీర మా కోడలు నాలుగొందలకే తెచ్చింది బజార్నించీ" అన్నది. లోపల భయంగా ఉన్న "క్వాలిటీ తేడా ఉంటుందిలెండి అన్నాను" బింకంగా.

"ఆ అనుమానంతోనే కదా ఈ చీరని ఇంతసేపు పరీక్షించింది! మా కోడలు తెచ్చిన చీర నువ్వు కొన్న చీర ఒకటే క్వాలిటీ. వంద రూపాయలు అనవసరంగా దండగ పెట్టావు"

అయిపోయింది. ఇక నా పని గోవిందా! ఇక్కడ ఈవిడ నొక్కిన రిమోట్‌కి పక్క గదిలో మా ఆయన భగ్గుమనడం ఖాయం. ఈవిడ వెళ్లాక ఆయన నాకు క్లాసు పీకడం అంతకన్నా ఖాయం. ఒక్క రూపాయి అనవసరంగా ఖర్చుపెట్టినా మా ఆయన రుద్రుడైపోతాడు. ఆ సంగతి బాగా అనుభవం నాకు. నేనూహించినట్టే వర్ధనమ్మగారు అలా గడప దాటారో లేదో ఆయన నామీద ఇంతెత్తున ఎగిరారు.

"నీకు చీరల నాణ్యత చూడడం తెలీదు. నాణ్యతని బట్టి బట్టల రేటు అంచనా వేయడం అంతకన్నా తెలీదు. అన్నిటికీ మించి డబ్బు విలువ తెలీదు. ఆ చీర వెంటనే పద్మావతిగారికి రిటన్ చేసేవ్ అలాటి చీరే ఇంకా తక్కువ రేటుకి బజార్లో కొనుక్కోవచ్చు" అన్నారు.



"ఒకసారి కొన్న చీర తిరిగి ఇచ్చేస్తే బాగుండదు. ఈసారికి వదిలేయండి ఇంకెపుడూ ఆవిడ దగ్గర కొనను. మీలాగా అలా నిర్మొహమాటంగా ఉండడం చాతకాదు నాకు" అన్నాను.

అలా అన్నందుకు ఓ గంటసేపు తిట్టిపోసి రెండు రోజులు నాతో మాట్లాడడం మానేశారాయన.

* * *

ఆ రోజు ఎం.సెట్. ఫలితాలు వచ్చాయి.

"అమ్మా" అంటూ వెలిగిపోతున్న మొహంతో పరిగెత్తుకొచ్చాడు నా కొడుకు. వీడి మొహం చూస్తేనే అర్థమైపోయింది. నాకు వీడికి మంచి రాంకు వచ్చింది. ఆ రోజు ఇంట్లో పండగ వాతావరణం నెలకొంది.

"మంచి రాంకు తెచ్చుకుంటే బైక్ కొనిస్తానన్నావు కదమ్మా" గుర్తు చేశాడు అఖిల్.

"అలాగే లేరా నాన్నతో చెప్తాలే" అన్నాను. అన్నట్టుగానే ఆయనతో చెప్పి వప్పించాను కూడా.

మొదటిసారిగా బైకుని గుడికి తీసికెళ్లి పూజ చేయించాడు వాడు. పెరిగిపోతున్న ట్రాఫిక్‌ని చూసినప్పుడల్లా నా పిల్లాడు బైక్ వేసుకుని వెడుతూంటే దిగులుగా ఉంటుంది నాకు. "ఒరే కన్నా జాగ్రర్తరా - స్పీడుగా వెళ్లకురా" అంటూ నాకు తోచిన జాగ్రర్తలు చెప్పడం అలవాటైపోయింది నాకు.

ఓ రోజు నే భయపడినంతా జరిగింది.

మా అఖిల్‌కి యాక్సిడెంట్ అయిందని హాస్పిటల్‌కి తీసుకెళ్లామనీ ఫోన్ చేసి చెప్పారు వాడి ఫ్రెండ్స్. ఆదరా బాదరాగా నేనూ, మా వారూ హాస్పిటల్‌కి పరిగెత్తాం. "భయపడకండి అంటే చిన్న ఫ్రాక్చరే" గేటులోనే ఎదురొచ్చి చెప్పాడు వాడి ఫ్రెండు. ఆందోళనగా వెళ్లి చూశాను నా కొడుకు అఖిల్‌ని. ఎప్పుడూ చురుకుగా తిరుగుతూ హుషారుగా కబుర్లు చెప్పే పిల్లాడు అలా నిస్త్రాణగా మంచం మీద ఉండడం చూసి గట్టిగా ఏడ్చేశాను. నన్ను చూసి కంగారు పడ్డాడు వాడు. "నాకేం కాలేదమ్మా

## కరీనా సంబరం

కరీనా కపూర్-సల్మాన్ ఖాన్ కలిసి 'మై అవుర్ మిసెస్ ఖన్నా' అనే సినిమా చేస్తున్నారు. ఆ సినిమా షూటింగ్ ఈమధ్య ఆస్ట్రేలియాలో జరిగింది. అప్పుడు ఖాళీ టైంలో షాపింగ్‌కని బయల్దేరిన కరీనాకి తోడుగా సల్మాన్ కూడా వెళ్లి ఆమె ఎంతో మోజు పడిన ఓ హ్యాండ్ బ్యాగ్‌ని గిఫ్టుగా కొనిచ్చాడట. ఆ హ్యాండ్ బ్యాగ్ ఖరీదు మన ఇండియన్ కరెన్సీలో రెండు లక్షల పైనేనట. అంత ఖరీదైన గిఫ్టుని తనకిచ్చినందుకు కరీనా తెగ సంబరపడిపోయిందిట. టాప్ హీరోగా రాణించడమే కాదు, గిఫ్టులివ్వడంలోనూ తన టాప్ అని సల్మాన్ నిరూపించుకుంటున్నాడన్నమాట.

చిన్న ఫ్రాక్చరే” చిన్నవాడైనా వాడు నాకు ధైర్యం చెప్పాడు.

“జరిగిందాంట్లో నా తప్పేం లేదమ్మా. ఎదురుగా వచ్చే ఆటో రాంగ్ రూట్లో వచ్చి...” వివరణ ఇవ్వబోయాడు నా కొడుకు.

“నీ తప్పు లేదని నాకు తెలుసు. నీ ఫ్రెండ్స్ జరిగిందంతా చెప్పారు” అన్నాను. మనసు దిటవు చేసుకొని వాడికి సపర్యలు చేయడం మొదలుపెట్టాను. అప్పుడొచ్చింది వర్ధనమ్మగారు వస్తూనే-

“అయ్యో ఎంత పని జరిగిందీ! ఐనా నేనప్పుడే అనుకున్నానమ్మాయ్ ఇలాంటి దేదో జరుగుతుందని” అన్నది అలవాటు చొప్పున.

అసలే బాధలో, టెన్షన్‌లో ఉన్నాను. ఆవిడ అలా అనేసరికి వళ్లు మండింది నాకు.

“అప్పుడే అంటే ఎప్పుడు? ఎప్పుడు ఏమనుకున్నారు? అంటే నా కొడుకు బైక్ కొనుక్కున్నప్పుడే అనుకున్నారా వీడికి యాక్సిడెంటయి కాలు ఫ్రాక్చరవుతుందని.” అన్నాను కోపంగా.

అంత లావు మనిషీ నా గొంతులోని తీవ్రతకి బెదిరింది.

“అయ్యో, అదేం మాటే అమ్మాయ్ అయినా ముక్కుపచ్చలారని పిల్లాడికి బండి కొనిస్తారా ఎవరైనా. ఈ కాలం కుర్రాళ్ల దుడుకుతనం తెలియందేముంది? మీసాలు కూడా సరిగా రాకుండానే ఏ హీరోహోండా మీదో రయ్యిన పోతుంటారు. ప్రమాదాలు జరిగాయంటే జరగవూ మరి” అన్నది తనని తను సమర్థించుకుంటూ.

“మీరు చెప్పే కుర్రాళ్లు వేరే ఉంటారు. నా పిల్లాడు అలాటి ఆకతాయి పిల్లాడు కాదు. వాడి గురించి కన్నతల్లిని నాకు తెలీదా ఏమిటి? వీడు సరిగానే డ్రైవ్ చేస్తున్నాడు. ఎదురుగా వచ్చే వెహికల్ రాంగ్ రూట్లో రాష్‌గా వస్తే అందుకు వీడా బాధ్యుడు?”

వర్ధనమ్మ మాట్లాడలేదు. ఇన్నాళ్లూ తన సుత్తి కబుర్లతో నా విలువైన కాలాన్ని మింగేసిన ఆవిడ మీద కసి తీర్చుకోవాలనిపించింది నాకు.


“తమరు సర్వజ్ఞులు - సమస్త విషయాలూ తెలిసిన జ్ఞాని. జరగబోయే సంఘటనలన్నీ ముందే ఊహించి చెప్పగల దిట్ట. ఎవరింట్లో మొగుడు పెళ్లాలు ఎప్పుడు గొడవ పడతారో, ఎవరి పిల్లలు ఎవరితో లేచిపోతారో ఏ అత్తకీ కోడలికీ ఎలాటి గొడవలున్నాయో మీరు ఊహించి చెప్పినట్టు కాలజ్ఞానం రాసిన బ్రహ్మంగారు కూడా ఊహించలేరు”

“ఏమిటే ఏదో కష్టంలో ఉన్నావు. పలకరించి పోదామని వస్తే ఇన్నేసి మాటలంటున్నావ్” అన్నది వర్ధనమ్మగారు విస్తుపోతూ.

“నేనిలా అంటానని ముందే అనుకుని ఉండరు. పప్పులూ, పంచదార అప్పు తీసుకుపోతూ ఉంటారు. నాలుగు గ్లాసుల కంది పప్పు అప్పు తీసుకెళ్లి మూడు గ్లాసులే అప్పుతీరుస్తారు. ఆ నాలుగో గ్లాసు సంగతి నే మర్చిపోయి ఉంటాలే అని ఊహిస్తారా ఏమిటి? చిక్కటి పాలు తీసుకెళ్లి నీళ్లపాలు బదులు తీరుస్తారు. పెద్దావిడ గదా నేను అడగనులే అని ఊహించే అలా చేస్తారని నా నమ్మకం” మాటలు తూటాల్లా విసురుతున్నాను. ఒక్కదానికీ వర్ధనమ్మగారి దగ్గిర జవాబు లేదు.

“మనం ఎప్పుడూ ఒకేలా ఉంటామని చెప్పలేం! ఎవరి జీవితంలో ఎప్పుడూ ఏ సంఘటన జరుగుతుందో ఎవరూ చెప్పలేరు. అందుకని ఇంకెప్పుడూ ఎవరిని పరామర్శించడానికి వెళ్లినా “మీకిప్పుడిలా జరుగుతుందని నేనెప్పుడో అనుకున్నానంటూ” కబుర్లు చెప్పకండి. ఒకవేళ ఎవరికైనా చెడు జరుగుతుందని ఊహించగలిగినా అలా జరక్కుండా ఉండాలని ఆ దేవుడిని ప్రార్థించండి” ఇక భరించలేక జారుకున్న వర్ధనమ్మగారు మళ్లీ మా గడప తొక్కలేదు.






## స్లిమ్ అండ్ ట్రిమ్

బెంగాలీభామ మధురిమ మెల్ల మెల్లగా టాలీవుడ్‌లో నలుగురి దృష్టినీ ఆకట్టుకుంటోంది. తెరపై అందాల్ని ఆరేయడంలోనూ పెద్దగా అభ్యంతరాలు చెప్పని మధురిమకి స్వతహాగా మాత్రం చాలా లైట్‌గా వుండే దుస్తులు వేసుకోవడమే ఇష్టం అంటుంది. మరీ హెవీగా డ్రెసప్ కావడం తనకి నచ్చదని, కాకపోతే సినిమాల్లో నటించేటప్పుడు పాత్రకి అనుగుణంగా డ్రెస్సింగ్ చేసుకోవడం తప్పదని చెబుతుంది. స్లిమ్ అండ్ ట్రిమ్‌గా వుండడం అంటే ఇదే కదా!